క్లుప్తంగా

నేదురుమల్లికి కృతజ్ఞతలు



నేదురుమల్లికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఆలయ నిర్వాహకులు

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని కోళ్ల ఫారం సెంటర్‌లో ఇరువర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు నేపథ్యంలో శ్రీరామ మందిర నిర్మాణం ఆగిపోయింది. అయితే వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణానికి చొరవ చూపినందుకు ఆలయ నిర్వాహకులు నేదురుమల్లి నివాసానికి చేరుకుని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కండలేరులో 8.467టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 8.467 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 490 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామదేవతకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో శీతలాంబ అమ్మవారు

ఓజిలి: మండలంలోని ముమ్మాయిపాళెం గ్రామంలో గ్రామదేవత శ్రీశీతలాంబ అమ్మవారికి గ్రామస్తులు శుక్రవారం పొంగళ్లు పెట్టారు. ముందుగా గ్రామస్తులంతా పొంగళ్ల ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామస్తులు ఆలయంలో పూజలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ శంకు సుజాత, వైఎస్సార్ సీపీ నేతలు ఎద్దు చిన్నపెంచలయ్య, శంకు మహేంద్ర తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనరసింహుని హుండీ ఆదాయం రూ.93 లక్షలు



పెంచలకోనలో హుండీల లెక్కింపు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో వెలసియున్న పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలోని హుండీల కానుకల లెక్కింపులో భారీ రాబడి వచ్చిందని డీసీ విజయసాగర్ తెలిపారు. శ్రీవారి మండపంలో శుక్రవారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 87 రోజులకు లెక్కించిన శ్రీవారి హుండీల్లో రూ.93,41,901 వచ్చిందన్నారు. బంగారం 270 గ్రాములు, వెండి 4 కేజీల 20గ్రాములు వచ్చినట్లు చెప్పారు. కువైట్ దీనార్లు, సౌదీఅరేబియన్ రియాల్స్, అమెరికా డాలర్లు, పలుదేశాల విదేశీ నాణ్యాలు వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ సిబ్బంది, బ్యాంకు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

దక్కిలి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆరు సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఎస్‌ఐ చౌడయ్య, ఎంపీడీఓ లీలా మాధవి పాల్గొన్నారు.

నాలుగు టిప్పర్లు పట్టివేత

ఓజిలి: మండలంలోని ముమ్మాయపాళెం గ్రామంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలపై గురువారం రాత్రి ఎస్‌ఐ రవి బాబు దాడులు చేశారు. ముమ్మాయపాళెం గ్రామంలో నుంచి మట్టిని తిరుమలపూడి గ్రామానికి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు సమాచారంతో ఎస్‌ఐ నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి

ఓజిలి: కురుగొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ముమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- వైఎస్సార్ సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వెంకటగిరి(సైదాపురం): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో నియోజకవర్గంలోని కలువాయి మండల జేసీఎస్ కన్వీనర్ మాదాసు పవన్, డక్కిలి మండలానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పలువురు నేతలతో శుక్రవారం సమీక్షించారు. గ్రామాల్లో నిర్వహించబోయే ఎన్నికల ప్రచారాలు, కార్యాచరణ, ఎన్నికల నిబంధలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారుల సూచనల మేరకు పార్టీ నేతలు, శ్రేణులు నడుచుకోవాలన్నారు. ఎన్నికల్లో కోడ్‌ను ఉల్లంఘించే విధంగా చేయకూడదని సూచించారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకునే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఆర్ సీపీ నేతలు పి.పరంధామయ్య నాయుడు, గోవర్ధన్‌నాయుడు, యువజన విభాగం నాయకులు మోహన్, శ్రీనివాసులు నేదురుమల్లిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.



నేదురుమల్లితో మాదాసు పవన్ భేటీ

కలువాయి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలువాయి జేసీఎస్ మండల కన్వీనర్ మాదాసు యజ్ఞపవన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కలిసి కట్టుగా కృషి చేయాలని రామ్‌కుమార్‌రెడ్డి పవన్‌కు సూచించారు. కుల్లూరు ఉపసర్పంచ్ పొంకు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో మాదాసు యజ్ఞపవన్

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట టౌన్: కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామిరెడ్డి అమరేందర్‌రెడ్డి సోదరుడి కుమార్తె లిఖిత, అశోక్ రెడ్డిల వివాహ వేడుకలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతోపాటు ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వేణుంబాక మునస్వామినాయుడు, కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడ కుమార్, వెంకట కృష్ణారెడ్డి, దేవారెడ్డి విజయులురెడ్డి, దారా రవి తదితరులు వధూవరులను ఆశీర్వాదించారు.

ఎన్నికల సమావేశాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటశేషయ్య

ఓజిలి: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలంటే 48 గంటల ముందు సువిధ అనే యాప్ ద్వారా అనుమతులు పొందాలని డీఎల్‌డీఓ వెంకటశేషయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లుతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థులు, గ్రామాల్లోని నాయకులు సమావేశాలు, మైక్, వాహనాలకు అనుమతులు పొందాలంటే సువిధ యాప్ ద్వారా తప్పకుండా అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీవిజిల్ యాప్ ద్వారా ప్రజలు ఎన్నికల విషయాలను ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన 4 రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా ఎన్నికల విషయాలను ప్రజలకు త్వరితగతిన సమాచారం అందించాలన్నారు. తహసీల్దార్ నాంచారయ్య, ఎంసీసీ నోడల్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి నెలాఖరు వరకు గడువు

వెంకటగిరి రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ పాఠశాల 5, 6, 7, 8 తరగతులు, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యా కోర్సులకు సంబంధించి ఈ నెలాఖరు వరకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఉన్నట్లు ఆ ఏపీఆర్‌ఎస్ కన్వీనర్ మల్లంపాటి రజని, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శారదాబాయిచౌదరి, గురుకుల జూనియర్ కళాశాల నుండి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో చక్కటి విద్యాబోధన, పౌష్టికాహారంతో కూడిన భోజనం, వసతి సౌకర్యంతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ కళాశాలకు ధీటుగా సీఎంఏ/సీఏ, నీట్, ఐఐటీ ఇతర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 25వ తేదీన ప్రవేశ అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ముమ్మరంగా వైఎస్సార్ సీపీ ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి తదితరులు

కలువాయి: వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం కలువాయి మండలం పెరంకొండ, దాసరిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు కొండంత అండగా నిలబడ్డారన్నారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, సర్పంచ్ డి.వజ్రమ్మ, ఉప సర్పంచ్ బి.రామశేషయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో యంత్రాల వినియోగం



యంత్రాలతో పనులు చేసినట్లు ఆనవాళ్లు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో కొంత మంది క్షేత్ర సహాయకులు అధికారుల సహకారంతో యంత్రాలను వినయోగిస్తున్నారు. శుక్రవారం మండలంలోని అంకులపాటూరు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనుల్లో యంత్రాలను వినయోగించినట్లు స్థానికుల నుంచి అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఉడతావారిపాళెం గ్రామ పంచాయితీలోని ఉడతావారిపాళెం, వడ్డికండ్రిగ, అంకులపాటూరు గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్నారు. అంకులపాటూరు గ్రామ చెరువులో ఇటీవల రూ 9.80 లక్షలతో చేపట్టిన మినీ అమృత్ సరోవర్ పనుల్లో ఇప్పటి వరకు రూ 2.63 లక్షల వరకు వేతనాలు అందించేలా పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయించే క్రమంలో జేసీబీని వినియోగించి పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా యంత్రాలను వినియోగించి పనులు జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని అన్నారు. ఏపీడీ వరప్రసాద్‌ను పంపి నివేదికలను తెప్పించుకుని పరిశీలిస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పెళ్లకూరు: స్వర్ణముఖి నది నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం తెల్లవారుజామున సెబ్ అధికారులు పట్టుకున్నారు. తాళ్వాయిపాడు గ్రామం వద్ద స్వర్ణముఖి నది నుండి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకొని సెబ్ కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌రావు తెలిపారు.

రెజ్లింగ్ పోటీల్లో కండలేరు విద్యార్థిని ప్రతిభ

రాపూరు: కండలేరు గురుకుల పాఠశాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంఈసీ చదువుతున్న లక్ష్మీప్రసన్న రెజ్లింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు గురుకుల ప్రిన్సిపల్ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో చిత్తూరులో అండర్–20 రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రెజ్లింగ్ చాంపియన్స్ షిప్ పోటీల్లో 76 కేటగిరి కింద సిల్వర్ మెడల్ సాధించిందని తెలిపారు. లక్ష్మీప్రసన్నను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



సిల్వర్ మెడల్ అందుకుంటున్న లక్ష్మీప్రసన్న

డక్కిలిలో ముమ్మరంగా ఫ్లెక్సీలు తొలగింపు



టీడీపీ రంగుకు పెయింటింగ్ వేయిస్తున్న పంచాయితీ కార్యదర్శి

డక్కిలి: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో డక్కిలిలో పలు పార్టీల ఫ్లెక్సీలు, బోర్డులు తొలగిస్తున్నారు. ఎంపీడీఓ లీలామాధవి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ముమ్మరంగా తొలగింపు చర్యలు చేపట్టారు. జన్మభూమి –మా ఊరు గోడపై రాతలను తొలగించేందుకు శుక్రవారం పెయింటింగ్ పనులు చేపట్టారు.

ఉచ్చూరులో ఆరోగ్య సురక్ష

దొరవారిసత్రం: ఉచ్చూరు గ్రామ పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని అధికారులు నిర్వహించారు. డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య చుట్టు పక్కల ప్రాంతాల నుంచి విచ్చేసిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కంటి పరీక్షలు చేసి దృష్టి లోపం ఉన్న వారి గుర్తించి కంటి అద్దాల కోసం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు స్టీఫెన్ నవీన్, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గులించెర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష

సైదాపురం: గులించెర్ల సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. కంటి పరీక్షలను నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ పురుషోత్తం, శివకుమార్, వైద్యులు డాక్టర్ శ్రావణి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నను గెలిపించాలి



గూడూరు రూరల్: ప్రచారంలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ తనయుడు

గూడూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు గీటురాయిగా తీసుకుని మరోసారి అవకాశం ఇస్తూ గూడూరులో మేరిగ మురళీధర్‌ను కూడా గెలిపించాలని శుక్రవారం ముమ్మర ప్రచారం చేపట్టారు. గూడూరు మున్సిపల్ పరిధిలోని 1, 2 వ వార్డుల్లోని శాంతి నగర్, అంబేడ్కర్ నగర్, బనిగిసాహెబ్ పేటలలో ఎమ్మెల్సీ, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తనయులు ప్రచారం చేపట్టారు. మేరిగ తనయులు డాక్టర్ రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత శాంతినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం చేపట్టిన ప్రచారంలో మహిళలు హారతులు పడుతూ స్వాగతించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని ఏ విధంగా మరచి పోకుండా ఉన్నారో అదే రీతిలో సీఎం జగనన్నను ఆదరిస్తున్నారని అన్నారు. తమ తండ్రి మేరిగ మురళీధర్ కూడా చిన్న కుటుంబం నుంచి పేదలకు సేవ చేయాలనే తలంపుతో వచ్చారని ఆయన్ను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూదూరు గురవయ్య, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, నాయకులు కొండూరు సునీల్‌రెడ్డి, అట్ల శ్రీనివాసులురెడ్డి, కొట్టు గోవర్ధన్, తూపిలి లక్ష్మీ, రమీజా, తాళ్లూరు శ్రీనివాసులు, చోళవరం గిరిబాబు, కృష్ణప్రసాద్ రెడ్డి, సతీష్‌రెడ్డి, అన్నం మురళీ, అజీజ్‌ఖాన్, సుభాన్, ధనమ్మ, దయాకర్, కొట్టు అశోక్, గారా వంశీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

గాంధీనగర్‌లోని గ్లోరియస్ చర్చి వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. అక్కడి సంఘ కాపరులతో మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఉపవాస ప్రార్థనల ముగింపు సందర్భంగా సంఘ కాపరులతో మేరిగ మాట్లాడారు. సనత్ నగర్‌లోని తన నివాసం వద్ద పట్టణ, రూరల్ ప్రాంతంలోని వైఎస్సార్ సీపీ నాయకులకు తన తనయులు డాక్టర్ రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్‌లను పరిచయం చేసి పట్టణ ప్రాంతంలోని అన్ని వార్డులలో ప్రచార బాధ్యతలను అప్పగిస్తున్నట్లు తెలిపారు. వారికి నాయకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, అట్ల శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్, మగ్దూం, అజీజ్‌ఖాన్, అన్వర్‌బాషా, లక్ష్మణ్‌రెడ్డి, హషీం, కాలేషా, పూర్ణచంద్ర, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు



కోట: మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా వెలుగులు నింపాయని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. శుక్రవారం కోటలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మురళీధర్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. అందరి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను అమలు చేసి సగర్వంగా తలెత్తుకుని జనంలోకి వెళ్లే మనకు అవకాశం జగనన్న కల్పించారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అమలు చేశారని తెలిపారు.వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో మేరిగ మురళీధర్‌ను గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రూట్ మ్యాప్ ప్రకారం ప్రణాళికబద్ధంగా ప్రచారం మొదలు పెడదామన్నారు. నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, దాసరి అంజమ్మ, రమణయ్య, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, నాగూర్‌రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ చోరీకి యత్నం



బైక్ వైర్లు కట్ చేసి సీటు ఎత్తుకెళ్లిన దుండగులు

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి గ్రామంలో బైక్ చోరీ చేసేందుకు గుర్తు తెలియని దుండగులు శుక్రవారం విఫలయత్నం చేశారు. గ్రామస్తుల వివరాలు మేరకు గ్రామానికి చెందిన మాబాషా ఇంటి ఆవరణలో బైక్‌ను నిలిపి రాత్రి ఇంటిలో నిద్రిస్తున్నారు. గుర్తుతెలియని దుండగులు బైక్‌ను శివాలయం వద్దకు తీసుకెళ్లారు. బైక్‌కు హ్యాండ్‌లాక్ వేయడంతో దుండగులు దానిని అపహరించుకుని వెళ్లలేక బైక్ బ్యాటరీ, సీటులను ఎత్తుకెళ్లారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేసి దుండగులను పట్టుకోవాలని కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్లు ప్రారంభం

వెంకటగిరి రూరల్: శ్రీనివాసన్ సర్వీసు ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లు ప్రారంభించారు. బంగారుపేట బీసీకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.2.10, ఏపీ ట్రైబల్ పాఠశాల రూ.2.10 వెంకటగిరి రూరల్ పరిధిలోని ఆర్‌ఎస్‌కండ్రిగ గిరిజన కాలనీల్లో రూ.4.75 లక్షల వ్యయంతో మూడు చోట్ల మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ సర్వీసు ట్రస్టు ప్రతినిధి జైసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్, బంగారుపేట పీహెచ్‌సీ వైద్యుడు శివకుమార్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీనివాసన్ సర్వీసు ట్రస్టు వీడీఓ అలేఖ్య, కేశవులు, పార్థసారథి, సిబ్బంది హరికృష్ణ పాల్గొన్నారు.



బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వెంకటగిరి రూరల్: పోషక విలువలు కలిగిన పదార్థాలు ఆహారంగా తీసుకుంటే మహిళలు, చిన్నారులు ఆరోగ్యకరంగా ఉంటారని జీకేపల్లి పీహెచ్‌సీ వైద్యశాల వైద్యుడు రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కళవలపూడి గ్రామంలోని పాఠశాలలో మహిళలు, చిన్నారులతో కలసి పోషణ్‌పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటీన్ కలిగిన పాలు, పండ్లు, కూర గాయలు నిత్యం ఆహారంగా తీసుకోవాలన్నారు. రక్తహీనతను నివారించేందుకు సమీపంలో అంగన్‌వాడీ సెంటర్లలో పంపిణీ చేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శంషాద్‌బేగం, మహిళలు పాల్గొన్నారు.



వెంకటగిరి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి ప్రసాద్

డక్కిలిలో..

డక్కిలి: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహరం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ డక్కిలి సెక్టార్ సూపర్‌వైజర్ పరిమళ అన్నారు. మండలంలోని దేవలపల్లి పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

శ్రేష్టమైన ఆహారంతో వ్యాధులు దూరం

బాలాయపల్లి(డక్కిలి): పోషక విలువలు ఆహారం తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, పోలమ్మ అన్నారు. మండలంలోని కాలగంధ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే పౌష్టికాహారాన్ని డిస్‌ప్లే ద్వారా తెలియజేశారు.

బరువు తక్కువ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రాపూరు: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. రాపూరు మండలం ఏపూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సుఖ ప్రసవం

చిల్లకూరు: గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడంతో కాన్పు సమయంలో సుఖ ప్రసవం జరుగుతుందని వల్లిపేడు ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రసన్నరాణి తెలిపారు. మండలంలోని వల్లిపేడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భవతులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ ,హెల్త్ సూపర్‌వైజర్ భువనేశ్వరి, మహిళా సంరక్షణ కార్యదర్శి శశి, అంగన్‌వాడీ కార్యకర్తలు మస్తానమ్మ, వాణి, పరమేశ్వరి, ధనమ్మ, కస్తూరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.







డక్కిలి: దేవులపల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పరిమళ, రాపూరు: ఏపూరులో పోషణ పక్వాడ, చిల్లకూరు: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రసన్నరాణి